# కంకర పోశారు.. బీటీ మరిచారు

- అసంపూర్తిగా బండలింగాపూర్ – విట్టంపేట రోడ్డు పనులు
- ఇబ్బంది పడుతున్న వాహనదారులు
- బీటీ వేయకపోవడంతో అవస్థలు
- త్వరగా పూర్తి చేయాలని డిమాండ్


కంకరపోసి వదిలేసిన బండలింగాపూర్-విట్టంపేట రహదారి

**మెట్‌పల్లిరూరల్:** గ్రామీణ ప్రాంతాల్లోని రహదారులు కంకర తేలి, గుంతలమయమై అధ్వానంగా మారాయి. ప్రభుత్వం బీటీరోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేసింది. దీంతో పలుచోట్ల పనులు ప్రారంభించినా అసంపూర్తిగా వదిలేశారు. ఫలితంగా వాహనదారులు, ప్రజలకు అవస్థలు తప్పడం లేదు. మెట్‌పల్లి మండలం బండలింగాపూర్–విట్టంపేట రోడ్డు పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి. పూర్తిస్థాయిలో పనులు చేయాల్సి ఉన్నా మధ్యలోనే వదిలేయడంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు.

**ఆర్‌అండ్‌బీ నుంచి నిధులు..**

బండలింగాపూర్–విట్టంపేట బీటీ రోడ్డు నిర్మాణానికి ఆర్‌అండ్‌బీ నుంచి ప్రభుత్వం రూ.కోటిన్నర నిధులు మంజూరు చేసింది. మూడునెలల క్రితం ఈ రహదారి పనులను ప్రారంభించారు. కానీ ఇప్పటివరకు పనులు పూర్తికాలేదు. బీటీ వేయాల్సి ఉండగా కంకరపోసి వదిలేశారు. దీంతో అసంపూర్తిగా పనులతో ప్రజలకు ఇక్కట్లు తప్పడం లేదని అసహనం వ్యక్తంచేస్తున్నారు. ఏళ్ల క్రితం వేసిన రహదారి దెబ్బతినడంతో ఇబ్బందులు పడ్డ ప్రజలు మొదట నూతన రోడ్డు పనులు ప్రారంభంకాగానే ఆనందపడ్డారు. కానీ అసంపూర్తిగా వదిలేయడంతో పెదవి విరుస్తున్నారు. సమీప ప్రాంతంలోని రైతులు పంట పొలాలకు వెళ్లేందుకు నానా అవస్థలు పడుతున్నారు.

**వాహనదారుల ఇక్కట్లు..**

రోడ్డు పనులు మధ్యలోనే వదిలేయడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ మార్గం గుండా నిత్యం రాకపోకలు సాగుతుంటాయి. అత్యవసర పనుల నిమిత్తం ఈ మార్గం గుండా వెళ్లేవారు ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉంది. 2.5 కిలో మీటర్ల దూరం ఉన్న ఈ రహదారిపై త్వరగా బీటీ వేయాలని, సకాలంలో పనులు పూర్తిచేసి ఇబ్బంది తలెత్తకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

### పనులు పూర్తిచేయాలి



గతంలో రోడ్డు దెబ్బతినడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నాం. ఇప్పడైనా నూతన రహదారితో ఇబ్బందులు తప్పుతాయి అనుకుంటే కంకర వేసి వదిలేశారు. బీటీవేసి పూర్తిస్థాయి పనులు చేపట్టాలి. – జంగిటి రాజేందర్, బండలింగాపూర్

### ఇబ్బంది పడుతున్నాం



అసంపూర్తి రోడ్డు పనులతో ప్రజలు నిత్యం ఇబ్బంది పడుతున్నారు. కంకర వేసిన రహదారిపై ప్రయాణించాలంటే ప్రయాణికులు జంకుతున్నారు. అధికారులు రహదారి పనులు త్వరగా పూర్తయ్యేలా దృష్టి సారించాలి. – ప్రతాప్‌రెడ్డి, బండలింగాపూర్

### కూలీల సమస్యతోనే పనులు ఆలస్యం

కూలీల సమస్య తీవ్రంగా ఉంది. అందుకే రహదారి పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి. ప్రజలు ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని త్వరలోనే రోడ్డు పనులు పూర్తిచేసేలా చొరవచూపుతాం.

–వేణు, ఏఈ ఆర్‌అండ్‌బీ, మెట్‌పల్లి


## పొంచి ఉన్న ప్రమాదం



**మల్లాపూర్ :** మండలంలోని ఒబులాపూర్ శివారులో నిర్మల్–జగిత్యాల 61వ జాతీయ రహదారిలో బాదనకుర్తి వంతెనపై సైడ్‌వాల్ కూలిపోయింది. దీంతో వాహనదారులకు ప్రమాదం పొంచి ఉంది. ఈ వంతెనపై నుంచి ఆర్టీసీ బస్సులతో పాటు వందలాది వాహనాలు నిత్యం రాకపోకలు కొనసాగిస్తాయి. వంతెన సైడ్‌వాల్ కూలిపోయి ఉండడంతో వాహనచోదకులతో పాటు ప్రయాణికులు భయాందోళనకు గురవుతున్నారు. తక్షణమే సంబంధిత అధికారులు స్పందించి వంతెనపై కూలిన సైడ్‌వాల్‌కు మరమ్మతు చేయించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

# పనులు ప్రారంభించి ఏడేళ్లు..

- ఇదీ సిరికొండ– తక్కళ్లపెల్లి బ్రిడ్జి దుస్థితి
- ఇంకా పూర్తికాని పనులు
- వాగులో నుంచి రాకపోకలకు అవస్థలు


సిరికొండ- తక్కళ్లపెల్లి వాగులో అసంపూర్తిగా బ్రిడ్జి నిర్మాణ పనులు

**కథలాపూర్:** అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేస్తున్నామని ఆర్భాటంగా ప్రారంభోత్సవాలు చేస్తున్నా ఏళ్ల తరబడి పనులు పూర్తికాకపోవడంతో ప్రజాప్రతినిధుల, అధికారుల తీరుపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మండలం సిరికొండ– తక్కళ్లపెల్లి గ్రామాల మధ్య వాగుపై బ్రిడ్జి నిర్మాణమే ఇందుకు నిదర్శనం. రెండు గ్రామాల మధ్య వాగుపై బ్రిడ్జి నిర్మాణానికి ఆర్‌అండ్‌బీ శాఖ నుంచి నిధులు మంజూరుతోపాటు పనులు ప్రారంభించి ఏడేళ్లవుతున్నా ఇంకా అసంపూర్తిగానే మిగిలిపోయింది. పనులు ఆలస్యంగా ప్రారంభించిన కాంట్రాక్టర్ మధ్యలోనే ఆపేశారు. దీంతో రాకపోకలకు రెండు గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బంది ఎదుర్కొంటున్నారు. సకాలంలో బ్రిడ్జి పనులు పూర్తయితే సమస్య తీరుతుందని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

**రూ. 6 కోట్లతో బ్రిడ్జి పనులు**

సిరికొండ– తక్కళ్లపెల్లి గ్రామాల మధ్య వాగు ఉండటంతో తక్కళ్లపెల్లి గ్రామస్తులు మండలకేంద్రానికి చేరుకోవాలంటే ఏళ్లుగా అవస్థలు పడుతున్నారని భావించి ఆరేళ్ల క్రితం ప్రభుత్వం బ్రిడ్జి నిర్మాణానికి రూ. 6 కోట్లు నిధులు మంజూరు చేసింది. 2016 సంవత్సరం అక్టోబర్‌లో పనులను ప్రారంభించారు. ఇప్పటికీ బ్రిడ్జి పనులు పూర్తికాకపోవడంతో అధికారులు, ప్రజాప్రతినిధుల పనితీరుకు నిదర్శనమని పలువురు మండిపడుతున్నారు. ఫలితంగా వాగులో నుంచి తక్కళ్లపెల్లి వాసులు మండల కార్యాలయాలకు వెళ్లాలంటే తిప్పలు పడాల్సిందే. మండలకేంద్రంలోని మోడల్‌స్కూల్‌లో చదివే విద్యార్థులు, ఇంటర్ చదివే తక్కళ్లపెల్లి విద్యార్థులకు సైతం కష్టాలు తప్పడం లేదని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు.

**అసహనం వ్యక్తం చేస్తున్న ప్రజలు**

సిరికొండ– తక్కళ్లపెల్లి మధ్య బ్రిడ్జి నిర్మాణాన్ని పరిశీలించిన అధికార పార్టీ నేతలు గతేడాది దసరా నాటికి పనులు పునఃప్రారంభించి త్వరగా పూర్తి చేయిస్తామని హామీ ఇచ్చారు. ఇప్పటికీ పనులు పునఃప్రారంభం కాకపోవడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు చొరవ చూపి నిర్మాణ పనులు త్వరగా పూర్తిచేయించి రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చూడాలని రెండు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

### కాలయాపన సరికాదు



బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరైతే ఏళ్లనాటి సమస్య తీరుతుందని ఆనందపడ్డాం. పనులు జాప్యం చేయడంతో ప్రజలకు రాకపోకలకు ఇబ్బందిగా మారింది. పనులను పరిశీలించిన నాయకులు ఇప్పుడు, అప్పుడు ప్రారంభిస్తామని వాయిదా వేస్తూ రావడం సరికాదు. పాలకుల నిర్లక్ష్యం వల్లే ఏళ్ల తరబడి పనులు సాగడంలేదు.

– జిల్లా సత్యం, తక్కళ్లపెల్లి

### పట్టించుకోవడం లేదు



రాకపోకలకు ఇబ్బంది పడుతున్న ప్రజాప్రతినిధులు పట్టించుకోని పరిస్థితి. నిధులు మంజూరైనా నిర్లక్ష్యం చేయడం సరికాదు. సకాలంలో పనులు పూర్తి చేయించడం ప్రజాప్రతినిధులు బాధ్యతగా భావించాలి. అప్పుడే గ్రామాలు అభివృద్ధి జరుగుతుంది. ఏళ్లుగా బ్రిడ్జి పూర్తిచేయకపోవడం విడ్డూరంగా ఉంది.

– కొడిపెల్లి అనిల్‌రెడ్డి, సిరికొండ

### త్వరలోనే పునఃప్రారంభిస్తాం



సిరికొండ– తక్కళ్లపెల్లి వాగుపై బ్రిడ్జి నిర్మాణం పనులు రెండు మూడు రోజుల్లో పునః ప్రారంభించేలా చర్యలు తీసుకుంటాం. పనులు త్వరగా చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించాం. వరదకాలువ నుంచి మట్టిని తీసుకువచ్చి రోడ్డును నిర్మించాల్సి ఉంది. మట్టిని తరలించేందుకు అధికారులు ఇటీవలే అనుమతి ఇచ్చారు. త్వరలో పనులు పూర్తి చేయిస్తాం.

– మధు, ఆర్‌అండ్‌బీ, ఏఈ, కథలాపూర్

## అసౌకర్యాలతో అగచాట్లు



**మెట్‌పల్లిరూరల్:** గ్రామ పంచాయతీలకు సొంత భవనాలు లేక ఇబ్బందులు తలెత్తుతున్నాయి. మెట్‌పల్లి మండలం కొండ్రికర్లలో నూతన గ్రామ పంచాయతీ భవనం నిర్మించేందుకు శిథిలావస్థకు చేరిన పాత భవనాన్ని కూల్చివేశారు. దీంతో పాత ప్రైమరీ పాఠశాలలో తాత్కాలికంగా గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. ఇందులో కనీస వసతులు లేకపోవడంతో పాటు అసౌకర్యాలతో ఇబ్బందులు ఎదుర్కొవాల్సిన పరిస్థితి నెలకొంది.

## క్లుప్తంగా

### పోలింగ్ బూత్‌ల్లో వసతుల పరిశీలన


వివరాలు అడిగి తెలుసుకుంటున్న ఎంపీడీవో

**ఇబ్రహీంపట్నం :** మండలంలోని డబ్బా, వర్షకొండ, ఇబ్రహీంపట్నంలో గురువారం పోలింగ్ బూత్‌లను ఎంపీడీవో ప్రభు పరిశీలించారు. ఇబ్రహీంపట్నం ప్రాథమిక పాఠశాలలో పోలింగ్ బూత్‌ను పరిశీలించి వాష్‌రూంలో వసతులు కల్పించాలని కార్యదర్శి సాయినాథ్‌కు సూచించారు. వర్షకొండలో పనులు పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీవో కృపాకర్, పంచాయతీ కార్యదర్శులు రాణి, రాకేశ్, సాయినాథ్ పాల్గొన్నారు.

### కంప్యూటర్ వితరణ


సీపీయూ అందిస్తున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు

**కోరుట్ల రూరల్:** మండలంలోని కల్లూరు శివారులో గల కస్తూర్బా గాంధీ పాఠశాలకు లయన్స్ క్లబ్ ఆఫ్ కోరుట్ల, లయన్స్ క్లబ్ ఆఫ్ కోరుట్ల కోటి నవదుర్గ ఆధ్వర్యంలో గురువారం కంప్యూటర్ సీపీయూను అందజేశారు. పట్టణంలోని పలువురు నిరుపేదలకు దుప్పట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా గవర్నర్ హనుమండ్ల రాజిరెడ్డి, లయన్స్ క్లబ్ ఆఫ్ కోరుట్ల అధ్యక్షుడు చంద్రమోహన్, కార్యదర్శి కుందారపు మహేందర్, కోశాధికారి కృష్ణ, లయన్స్ క్లబ్ ఆఫ్ కోరుట్ల కోటి నవదుర్గ అధ్యక్షురాలు వనపర్తి రమ్య, కార్యదర్శి ప్రేమలత, కోశాధికారి రాధిక, నాయకులు నారాయణరావు, దిలీప్ రావు, గుంటుక చంద్ర ప్రకాశ్, ఆడెపు మధు, తదితరులు పాల్గొన్నారు.

### ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలి


తేమశాతాన్ని పరిశీలిస్తున్న ఏవో

**ఇబ్రహీంపట్నం :** మండలకేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌యార్డులో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మండల వ్యవసాయ అధికారి దీపిక గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలన్నారు. ధాన్యంలో తేమశాతం లేకుండా చూడాలని, సిబ్బందికి సహకరించాలన్నారు. కార్యక్రమంలో ఏఈవో నరేశ్, రైతులు పాల్గొన్నారు.

### పేకాటరాయుళ్ల అరెస్ట్

**మెట్‌పల్లి:** పట్టణంలోని టీచర్స్ కాలనీ శివారులో గురువారం పేకాట ఆడుతున్న ఏడుగురిలో ముగ్గురిని పోలీసులు పట్టుకున్నారు. వారి వద్ద నుంచి రూ.21వేల నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై చిరంజీవి తెలిపారు. మరో నలుగురు అక్కడి నుంచి పరారైనట్లు ఆయన పేర్కొన్నారు.

### నివాళి

**పెగడపల్లి:** మండలంలోని లింగాపూర్ సర్పంచ్ ఈరెల్లి శంకర్ (52) బుధవారం రాత్రి గుండెపోటుతో మృతిచెందాడు. మంత్రి ఈశ్వర్, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, జెడ్పీటీసీ రాజేందర్‌రావు, ఎంపీటీసీ శోభ, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ నాయకుడు గజ్జల స్వామి, పలువురు గురువారం భౌతికకాయాన్ని సందర్శించి నివాళి అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. పలు గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, వివిధ పార్టీల నాయకులు, అంబేడ్కర్ సంఘాల నాయకులు, తదితరులు అంత్యక్రియల్లో పాల్గొన్నారు.

### పరామర్శ

**ధర్మపురి:** మండలంలోని రాజారం గ్రామానికి చెందిన దేవరకొండ భాస్కర్ రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. అదే గ్రామానికి చెందిన అరవింద్ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా బాధిత కుటుంబాలను రాష్ట్ర సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ గురువారం పరామర్శించారు.

# అధికారంలోకి రాగానే గ్యారంటీ పథకాలు

- జగిత్యాల కాంగ్రెస్ అభ్యర్థి జీవన్‌రెడ్డి


జగిత్యాలరూరల్: మాట్లాడుతున్న జీవన్‌రెడ్డి

**జగిత్యాలరూరల్:** రాష్ట్రంలోని ప్రతి నిరుపేద ఇంటికి అధికారంలోకి రాగానే కాంగ్రెస్ ఆరు గ్యారంటీలను అమలుచేస్తామని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. గురువారం రాత్రి మండలంలోని కన్నాపూర్‌లో ప్రచారం నిర్వహించారు.

**కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం**

రాష్ట్ర అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యమవుతుందని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. నర్సింగాపూర్, వంజరిపల్లిలో ప్రచారం నిర్వహించారు. ఎన్నికల ఖర్చు కోసం నర్సింగాపూర్‌కు చెందిన మద్దెల ఈశ్వరమ్మ రూ.వెయ్యి, గడ్డం భూమారెడ్డి రూ.50 వేలు, వంజరిపల్లిలో లచ్చం రూ.5 వేల అందించారు.

**కోరుట్ల:** గత కాంగ్రెస్ ప్రభుత్వ పథకాలను కేసీఆర్ ప్రభుత్వం కొనసాగిస్తూ వస్తుంది తప్ప కొత్తదనం లేదని కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి జీవన్ రెడ్డి అన్నారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ హయాంలో తాను, మాజీ మంత్రి స్వర్గీయ జువ్వాడి రత్నాకర్‌రావుకు కోరుట్ల, జగిత్యాల నియోజకవర్గాల అభివృద్ధికి పోటీ పడేవారమన్నారు. కోరుట్ల కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి జువ్వాడి నర్సింగరావు, సీ నియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు, పట్టణ, మండలకాంగ్రెస్ అధ్యక్షులు, నాయకులు పాల్గొన్నారు.

**సారంగాపూర్:** సారంగాపూర్, బీర్‌పూర్ మండలాల్లో కాంగ్రెస్ అభ్యర్థి జీవన్‌రెడ్డికి మద్దతుగా నాయకులు, కార్యకర్తలు ప్రచారం నిర్వహించారు.

# అవకాశమివ్వండి.. అభివృద్ధి చేస్తాం

- వేములవాడ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి ఆది శ్రీనివాస్


అంబారిపేటలో ప్రచారం చేస్తున్న ఆది శ్రీనివాస్, నాయకులు

**కథలాపూర్:** రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఒక్క అవకాశమిస్తే అభివృద్ధి చేస్తామని వేములవాడ ఎమ్మెల్యే అభ్యర్థి ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. గురువారం మండలంలోని కలిగోట, అంబారిపేట, తుర్తి, పోసానిపేట గ్రామాల్లో ఎన్నికల ప్రచారంలో పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి రాగానే కలిగోట సూరమ్మ ప్రాజెక్టును 18 నెలల్లో పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. మంత్రి హరీశ్‌రావు సూరమ్మ ప్రాజెక్టు కాలువ పనులకు భూమిపూజ చేసి ఐదేళ్లయినా తట్టెడు మట్టి తీయలేదన్నారు. తొమ్మిదిన్నరేళ్లు అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్ కనీసం తుర్తి– రుద్రంగి రోడ్డు పనులు చేయించకపోవడం సిగ్గుచేటన్నారు.కాంగ్రెస్ మండలాధ్యక్షుడు కాయితి నాగరాజు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎండీ అజీమ్, బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు యాగండ్ల రమేశ్, ఎన్‌ఆర్‌ఐ సెల్ నాయకులు బైరదేవ్‌యాదవ్, రాజారెడ్డి, శ్రీనివాస్, మధు, గడ్డం స్వామిరెడ్డి, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

# బీజేపీతోనే అన్ని వర్గాలకు మేలు


భూషణరావుపేటలో ప్రచారం చేస్తున్న బీజేపీ నాయకులు

**కథలాపూర్:** బీజేపీతోనే అన్నివర్గాలకు మేలు జరుగుతుందని ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎడ్మల వినోద్‌రెడ్డి కోరారు. గురువారం మండలంలోని భూషణరావుపేట, ఊట్‌పెల్లి, పెగ్గెర్ల గ్రామాల్లో వేములవాడ ఎమ్మెల్యే అభ్యర్థి చెన్నమనేని వికాస్‌రావుకు మద్దతుగా బీజేపీ నాయకులు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. పేద ప్రజలకు కేంద్రం ప్రభుత్వం ఉచితంగా రేషన్ బియ్యం ఇస్తుందన్నారు. బీజేపీ మండలాధ్యక్షుడు కంటె సత్యనారాయణ, మాజీ సర్పంచ్ గడ్డం రాజారెడ్డి, నాయకులు బత్తిని మహేశ్, అంగరి ప్రేమ్‌సాగర్, శ్రీనివాస్, ఉమేశ్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

# ఓటరు స్లిప్పుల పంపిణీకి ఏర్పాట్లు


పోసానిపేటలో ఓటర్లు స్లిప్పులు సరిచూస్తున్న బీఎల్‌వోలు

**కథలాపూర్:** ఈనెల 30న అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఓటర్లకు స్లిప్పులు పంపిణీ చేసేందుకు అధికారులు, సిబ్బంది ఏర్పాట్లు చేస్తున్నారు. మండలంలోని 19 గ్రామాల్లో 37,065 మంది ఓటర్లుండగా ఇందులో కొత్త ఓటర్లు 1,582 ఉన్నట్లు తహసీల్దార్ ముంతాజిబొద్దీన్ తెలిపారు. ఈ ఓటరు స్లిప్పులో ఓటరు ఏ పోలింగ్ బూత్‌లో ఓటు వేయాలో, వరుస సంఖ్యను తెలిపేలా ముద్రించారు. మండలంలో 41 పోలింగ్ బూత్‌లు ఉండగా 41 మంది బీఎల్‌వోలతో ఓటరు స్లిప్పులు అందించేలా అధికారులు ప్రణాళిక రూపొందించారు. కొత్త ఓటర్లు 1,582 మంది ఉండగా వారికి ఓటరు స్లిప్పులతోపాటు ఓటుహక్కు ఎలా వినియోగించుకోవాలో తెలియజేయనున్నారు. నాలుగు రోజుల్లో ఈ ప్రక్రియ పూర్తిచేయాలని ఉన్నతాధికారులు ఆదేశాలిచ్చారు. స్లిప్పులు అందకపోతే సంబంధిత బీఎల్‌వోలను సంప్రదించాలన్నారు.

## కార్యవర్గం ఎన్నిక

**రాయికల్:** మండలంలోని అల్లీపూర్ విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడిగా పొలాస సురేశ్, ఉపాధ్యక్షుడిగా ఎలేశ్వరం రాము, కార్యదర్శిగా ఇనుగుర్తి మణికంఠ, కోశాధికారిగా రేపాక రమేశ్, సలహాదారులుగా రేపాక సురేశ్, మనీశ్, ఇనుగుర్తి లింబాద్రి, మర్రిశెట్టి నరేశ్‌ను గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఎన్నికల కమిటీ నిర్వాహకులు మురళి తెలిపారు.

**మెట్‌పల్లి:** పట్టణ టెంట్‌హౌజ్ యూనియన్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కోటగిరి అరుణ్, గౌరవాధ్యక్షుడిగా గంగుల సత్యం, ఉపాధ్యక్షుడిగా సుంకేట విజయ్, ప్రధాన కార్యదర్శిగా దినేశ్, కోశాధికారిగా పోతు తుల సీరామ్, సహాయ కార్యదర్శిగా పడాల అరుణ్‌ను ఎన్నుకున్నారు.


ఎన్నికైన నూతన కార్యవర్గ సభ్యులు

### కోతుల బెడదను నియంత్రించాలి

**సారంగాపూర్:** మండలంలోని పలు గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు, కోతకు వచ్చిన పొలాల్లోకి కోతులు, అడవి పందులు చేరి పంటలకు తీవ్ర నష్టం కలిగిస్తున్నాయి. ఇప్పటివరకు వరి పొలాల్లో ఎక్కువ అడవి పందులతో సమస్య ఉండేది. ప్రస్తుతం కోతులకు ఎక్కడా ఆహారం లభించకపోవడంతో ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోకి మందల కొద్ది చేరి ధాన్యాన్ని నేలపాలు చేస్తున్నాయి. మండలంలో కోతులు బెడదను నియంత్రించాలని రైతులు కోరుతున్నారు.